# సాయం అందకపాయే.. సాగుడెట్లా..

**రైతుబంధు డబ్బుల కోసం అన్నదాతల నిరీక్షణ**

- రంగారెడ్డి జిల్లాలో 4,04,436 మందికి అందాల్సిన సాయం రూ.378.92కోట్లు
- ఇప్పటివరకు కేవలం 98,011 మంది ఖాతాల్లో రూ.20.11 కోట్లు జమ
- పంటల సాగుకు సమయం మించిపోతుండడంతో ఆందోళన
- తప్పని పరిస్థితుల్లో అప్పల వేటలో అన్నదాతలు



రంగారెడ్డి, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : 'యాసంగి సీజన్‌కు రైతు బంధు సాయం అందక రైతాంగం ఆందోళన చెందుతున్నది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన విధంగానే ఈ సారి సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సాయం అందించడంలో జాప్యం నెలకొంటున్నది. ఈ యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో 4,04,436 మంది రైతులకు రూ.378.92కోట్ల సాయాన్ని అందించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 98,011 మంది రైతులకు రూ.20.11కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 13 నుంచి సాయం పంపిణీ ప్రారంభమైనప్పటికీ అరకొర మందికి మాత్రమే సాయం వచ్చింది. ఇప్పటివరకు ఒక్క ఎకరా ఉన్న రైతులకు సాయం అందలేదు. గుంటల్లో ఉన్న వారికి మాత్రమే కాస్తో! కూస్తో! జమ అవుతున్నది. దీంతో రైతులు వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ సాయం డబ్బులు ఎప్పుడు ఖాతాల్లో జమ అవుతాయని అడుగుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో పెట్టుబడుల కోసం వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.'

**సాయం అందక ఇబ్బందులు**

జిల్లాలో ప్రస్తుత యాసంగిలో 1.23లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే మొక్కజొన్న, వేరుశనగ, ఆముదం, కుసుమలు, శనగలు తదితర పంటల సాగును సుమారు 10వేల ఎకరాల్లో రైతులు మొదలు పెట్టారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తామని చేసిన ప్రకటన రైతుల్లో సంతోషాన్ని నింపింది. ఈ సీజన్‌కు గత ప్రభుత్వంలో ఇచ్చినట్లుగానే ఎకరాకు రూ.5వేల సాయం అందిస్తామని చెప్పి రంగారెడ్డి జిల్లాలో 4,04,436 మందికి రూ.378.92కోట్ల సాయం అందించేందుకు నిర్ణయించింది. రైతుల ఖాతాల్లో జమ అయినట్లుగా పోర్టల్‌లో చూపుతున్న మొత్తం రైతుల ఖాతాలకు మాత్రం వెంటనే చేరడం లేదు. ప్రభుత్వం సాయం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి పది రోజులు కావొస్తున్నప్పటికీ ఇప్పటివరకు కేవలం రూ.20.11కోట్లు మాత్రమే జమ అయ్యాయి.

## ఒక్క ఎకరా రైతుకు కూడా ఇంకా డబ్బు రాలే..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 నుంచి రైతు బంధు పథకాన్ని మొదలుపెట్టి 11 విడుతల్లో నిర్విఘ్నంగా అందించింది. అప్పట్లో ఒక ఎకరా లోపు ఉన్న వారికి ముందుగా సాయం డబ్బులు రైతు ఖాతాల్లో జమ అయ్యేవి. ఆ తర్వాత రెండో రోజు రెండు ఎకరాల రైతులకు, మూడో రోజు మూడు ఎకరాల రైతులకు ఇలా.. సాయం డబ్బులు ఖాతాల్లో జమ అయ్యేవి. అయితే ప్రస్తుత యాసంగిలో మాత్రం గుంటల్లో భూమి ఉన్న వారికి తప్పా ఇప్పటివరకు ఎకరా ఉన్న రైతులకు రైతు బంధు సాయం రాలేదు. దీంతో రైతులు సాయం కోసం నిరీక్షించాల్సి వస్తున్నది. వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లి రైతు బంధు సాయంపై వాకబు చేయడం రైతులకు దినచర్యగా మారింది. కొందరు రైతులకు ఫోన్లు చేసి తెలుసుకుంటున్నారు. సీజన్ ఆరంభంలోనే అందాల్సిన సాయంలో జాప్యం నెలకొనడంపై రైతులు అయోమయానికి గురవుతున్నారు. పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేక.. చాలా మంది వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతు బంధు డబ్బుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ సాయం వస్తుందని అధికారులు రైతులకు భరోసా కల్పిస్తున్నారు.

# మత్తుకు చిత్తు కావొద్దు

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- నివారణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి
- జిల్లాస్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 21 : యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల సరఫరా జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కోటిరెడ్డితో కలిసి జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు ప్రాంతాల్లో గంజాయి సంస్కృతి కనిపిస్తున్నదని, దీనికి యువత అలవాటు పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, దీన్ని మొగ్గలోనే తుంచేయాలన్నారు. మాదకద్రవ్యాల కట్టడిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నదని గుర్తు చేశారు. మత్తు పదార్థాలకు ముఖ్యంగా స్కూల్, కాలేజీ విద్యార్థులు ఆకర్షితులయ్యే అవకాశం ఉందని, విద్యా సంస్థల్లో డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి వారానికోసారి సమావేశం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతినెలా జిల్లా స్థాయిలో కూడా సమావేశం నిర్వహించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా సంస్థలతో పాటు మహిళా సంఘాలు, లోకల్ బాడీలలో కూడా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత జిల్లాగా రూపొందించాలన్నారు.

**గంజాయి మొక్కలు పెంచకుండా..**

ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు తమ పంట పొలాల్లో గంజాయి మొక్కలు పెంచకుండా వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. గంజాయి పెంచే రైతులకు ప్రభుత్వం నుంచి రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు అందవని వివరించాలని సూచించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలు రాకుండా నిరోధించేందుకు గట్టి నిఘాను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఏర్పాటు తర్వాత నుంచి ఇప్పటి వరకు 25 డ్రగ్స్ కేసులు నమోదు చేసి 128 మందిపై చర్యలు తీసుకున్నామన్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా నిర్వహించే ఈవెంట్లలో మాదకద్రవ్యాలు వినియోగించరాదని సూచించారు. జిల్లాలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీసు, రెవెన్యూ ఫారెస్టు, ఎక్సైజ్, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా పనిచేసి ఎలాంటి సమాచారం అందినా వెంటనే పోలీసు శాఖకు తెలియపరచాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, డీఈవో రేణుకాదేవి, ఉపవైద్యాధికారి జీవరాజ్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, అగ్రికల్చర్, రెవెన్యూ, సంక్షేమ శాఖల సహాయ అధికారులు పాల్గొన్నారు.

# పనులను వేగవంతం చేయాలి

- సీడీఎంఏ డైరెక్టర్ హరిచందన
- మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల పరిశీలన

కొడంగల్, డిసెంబరు 21 : మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సీడీఎంఏ డైరెక్టర్ హరిచందన సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించి.. చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అధికారులతో సమీక్షించారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్ స్థలాన్ని పరిశీలించగా, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఈ స్థలంలో పార్క్ నిర్మాణం చేపడితే పట్టణ ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనాన్ని పరిశీలించి, నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆమె ఆదేశించారు. సమీకృత కూరగాయల మార్కెట్ చాలా వరకు అవసరం ఉండకపోవచ్చని ఆ ప్రాంతంలో టెన్నిస్, షటిల్ తదితర క్రీడలకు అనువుగా స్టేడియం నిర్మాణాలు చేపట్టేలా రీ డిజైన్ చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు సూచించారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలి స్థలం చాలా ఇరుగ్గా ఉందని, విస్తీర్ణం చేపట్టి, కొత్త అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొడంగల్ చెరువు కట్టపై నుంచి పాతకొడంగల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడితే చాలా వరకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. డంపింగ్ యార్డ్‌తో పాటు కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, ప్రభాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డితో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై అధికారులకు పలు సూచనలు ఇస్తున్న సీడీఎంఏ డైరెక్టర్ హరిచందన

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న మేనేజర్, ఉపవైద్యాధికారి

బొంరాస్‌పేట, డిసెంబర్ 21 : కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొడంగల్ ఎస్‌బీఐ మేనేజర్ రాధేశ్యాం అన్నారు. గురువారం మండలంలోని రేగడిమైలారం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న వివిధ రకాల పథకాలైన కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎంఈజీపీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీంద్ర యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమంత్ కుమార్, రేగడిమైలారం, నాగిరెడ్డిపల్లి సర్పంచ్‌లు రాజేశ్వరి, హన్మంతు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యాసంగి పంటల వివరాలు పక్కాగా నమోదు

**రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి**



షాబాద్‌లో యాసంగి పంటల వివరాల నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి

షాబాద్, డిసెంబర్ 21: రైతులు యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాల నమోదు పక్కాగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని క్లస్టర్ పరిధిలో రైతు లు సాగు చేసిన పంటల వివరాల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వరినాట్లు వేసుకునే సమయమని, నారుమడి యాజమాన్య పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున రాత్రిపూట నారుమడిలో నీరు తొలగించి మరుసటి రోజు ఉదయం కొత్త నీరు పెట్టుకోవాలని రైతులకు సూచించారు. నారుమడిలో ఇనుము, జింకు లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యాసంగి సీజన్‌కు రైతులు సాగు చేసిన పంటల వివరాల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మండల అధికారి వెంకటేశం, ఏఈఓ రాజేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీటీ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నేషనల్ క్వాలిటీ మానిటర్ శివకుమార్ గుప్తా తదితరులు

పెద్దేముల్, డిసెంబర్ 21 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు తప్పవని నేషనల్ క్వాలిటీ మానిటర్ శివకుమార్ గుప్తా హెచ్చరించారు. పెద్దేముల్ మండల కేంద్రం నుంచి సిద్ధన్నమదుగుతండా వరకు ఇటీవల నూతనంగా రూ.6 కోట్ల రూపాయలతో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా నిర్మించిన రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రోడ్డును నిర్మించారా? సూచిక బోర్డులు ఏర్పాటు చేశారా? నిర్మాణంలో భాగంగా రోడ్డులో ఎంతమేర మూడు రకాల కంకర, డస్ట్, మట్టి కంకర, తారు, పైన బీటీ ఎంత వేశారు? రోడ్డుకు ఇరువైపులా మట్టి వేశారా? ఎన్ని కల్వర్టులు నిర్మించారు? రోడ్డు మార్గంలో 250 మీటర్ల మేర ఒక గుంతను తవ్వించి నాణ్యత పనులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ ఈఈ రాములు, డీఈ వెంకట్‌రావు, ఏఈ సిద్ధార్థ, కాంట్రాక్టర్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.